# లవ్ గేమ్

అమృత అనే పేరులో ఏముందో తెలియదు కాని మనోహర్‌కు మాత్రం అది తేనె లాగా తియ్యగా అనిపించింది. చాక్లెటును నోటిలో స్వారస్యంగా చప్పరిస్తున్నట్లు ఆ పేరును రకరకాల గొంతులతో, రకరకాల బాణీల్లో ఉచ్చరిస్తున్నాడు మనోహర్. అమృతా ...... అమృతా

మొదటి బెంచి మీద రాజేశ్వరి ప్రక్కనే కూర్చుంది అమృత. మూడు వరుసలుగా వున్న



బెంచీల్లో; బెంచికి ఇద్దరున్నారు. మనోహర్, నేను అమృతాకు వెనక వున్న చివరి బెంచీలో కూర్చున్నాం.

ప్రతి శుక్రవారం మొదటి పీరియడ్ శైవ సిద్ధాంతం. మా లెక్చరర్ ఖచ్చితంగా పదింటికి వచ్చేవారు. కాని ఆ రోజు ఎందుకో ఇంకా రాలేదు.

అమృతాకు మాత్రమే వినిపించేటట్లు ఆమె వంక తలవంచి 'అమృతా- అమృతా...'' అని చిన్నగా పిలిచాడు మనోహర్. మనోహర్‌కు ఎట్ట ఎదుటగా ఆమె కూర్చుంది.

నేను కాస్త తొంగి చూశాను. ''ఆమె శైవ సిద్ధాంతం చదువుతోంది'' అని మనోహర్ చెవి కొరికాను.

మనోహర్ మళ్ళీ గొంతులో తేనె రాసుకొని ''అమృతా... అమృతా'' అన్నాడు. ఆమె కొద్దిగా వెనక్కి తిరిగి మొహం చిట్లించుకొని ''ఛ'' అంది. అంటే ''నోరు మూసుకో'' అని దాని అర్థం. కాని మనోహర్ మరింత రెచ్చిపోయాడు.

''ఏం చదువుతున్నావ్'' అడిగాడు.

నేను ఈ సమయంలో రంగ ప్రవేశం చేశాను. సాధారణంగా ఇలాంటి సమయాల్లో సిగ్గు బిడియాల్తో ఊరుకొనేవాణ్ణి. ఆ రోజు ఎందుకో కొంచెం హుషారుగా ఈ ఆటలో పాల్గొన్నాను. కొద్దిగా గొంతు మార్చుకొని అమ్మాయిలాగా 'శైవ సిద్ధాంతం చదువుకుంటున్నా'' అన్నాను.

అమృతా చాలా సీరియస్‌గా పుస్తకంలో కళ్ళు పెట్టి చదువుతున్నట్లు అభినయిస్తోంది. కాని ఆమె దగ్గర కూర్చున్న రాజేశ్వరి నన్ను సూటిగా ఒక్కసారి చూసింది. ''నువ్వు కూడానా?'' అన్నట్టు ఆమె చూపు నాకనిపించింది.

మనోహర్ గుసగుసలాడేటట్లు 'శైవ సిద్ధాంతం చదివే వయసా నీకు? విజయ విలాసం తీసి అందులో సుభద్ర వృత్తాంతం చదువు డార్లింగ్'' అన్నాడు. అంతే! తక్కుమని లేచింది అమృతా పుస్తకాన్ని మొహాన కొట్టినట్టు టపీమని మూసింది. లేచి రివ్వుమని ప్రిన్సిపాల్ రూమ్‌లోకి వెళ్ళింది. ప్రిన్సిపాల్ అంజయ్య ముక్కోపి. అమృత లోపలికి వెళ్ళడం అక్కడ వుండి చూశాం. నాకు మతి పోయింది.

''ఒరేయ్! అమృతా ప్రిన్సిపాల్ గదిలోకి వెళ్ళిందిరా! మన కొంప మునిగి పోయింది'' అన్నాను.

వాడు నిదానంగా నవ్వి ''నాయిక క్రీగంటి చూపుల కోసం నానా బాధలు పడడం ఆనందం. ఆ ప్రణయ రోగం పరమానందం. అందుకే కొనసాగిద్దాం మన వలపుల సాహసాల్ని'' అన్నాడు. అంటూ మెడ ముందుకు వంచి ''నాయికకు సాక్ష్యం చెప్పడానికి వెళ్ళలేదా రాజీ'' అని అన్నాడు.

ఆమె అతని వంక చూసి ''మొహం చూడు'' అంది. మనోహర్ తన చెక్కిళ్ళను తడుము కొంటూ ''చక్కని చిక్కని మొహం. ఇది నీకు నచ్చలేదా రాజీ? నీకు ఎలాంటి మొహం నచ్చుతుందో చెప్పవా, ఆరాతీసి తీసుకు వస్తాను'' అని అన్నాడు.

రాజేశ్వరి మళ్ళీ వెనక్కి తిరిగి ''చెవ్వేవ్వే...'' అని పెదవుల్ని అటూ ఇటూ మెరికలు తిప్పి వంకర మూతి పెట్టింది.


"అమ్మ బాబోయ్- ఇలాంటి మూతి కావాలా? అది ఏం బాగో లేదే! కాని నీకు నచ్చితే అలాంటిది వెతికి తీసుకు వస్తాను" అని మనోహర్ చెప్తున్నప్పుడు కాలేజి ప్యూన్ అక్కడ ప్రత్యక్షమయ్యాడు.

"ఏం బాబూ మనోహర్ ఎందుకు ఆ అమ్మాయితో గొడవ పెట్టుకొన్నావు. ప్రిన్సిపాల్ నిన్ను రమ్మంటున్నారు. ఆ అమ్మాయి బిగ్గరగా ఏడుస్తోంది" అన్నాడు.

మనోహర్ లేచి ప్రిన్సిపాల్ రూంకు వెళ్ళాడు.

మనోహర్ ఎప్పుడూ ఇంతే. ఏదో ఒక గొడవలో పట్టుబడి తిప్పలు పడుతుంటాడు.

అతని ప్రవర్తన చూస్తే నాకు వింతగా అనిపించేది. కాలేజీలో వున్నప్పుడు అమ్మాయిల్ని గేలి చేస్తుంటాడు. కాని వాళ్ళని బయట వాళ్ళు గేలి చేసినా లేదా సహ విద్యార్థులు అతిగా ప్రవర్తించినా




అతడు ఊరుకోడు. అలాంటి సందర్భాల్లో చట్టాన్ని తన చేతుల్లోకి తీసుకొంటాడు.

కాలేజి ప్రారంభించినప్పుడు పెద్ద రభసకు కారణమైన ఒక సంఘటన జరిగింది. కొత్తగా చేరిన అమ్మాయిల్ని చూడడానికి పడిగాపులు పడే కుర్రవాళ్ళ గుంపు ఒకటి అక్కడి బస్ స్టాప్ దగ్గర వున్న సైకిల్ షాప్‌లో కూర్చుండేది. బస్‌స్టాప్‌లో నిలబడున్న అమ్మాయిల్ని చూడగానే వాళ్ళకి పట్టరాని ఆనందం. రకరకాల కోతి చేష్టలు, కామెంట్స్ మొదలవుతాయి. వాళ్ళని చూస్తుంటే మెంటల్ హాస్పిటల్స్, సర్కస్‌లు గుర్తుకొస్తాయి.

ఒకరోజు ఆ గుంపులో నుంచి ఒక హీరో ఒక కాగితపుటమ్ముని సుజాత మీదికి విసిరాడు. సుజాత ఏమీ అనలేదు. అంతటితో ఊరుకోక ఆ హీరోగాడు ఆమె బస్ ఎక్కుతుంటే ఆ రద్దీలో చొరబడి ఒక చేతితో ఆమెను నెట్టాడు. పాపం సుజాత చేతిల్లో పుస్తకాలు కిందపడ్డాయి. వాటిని ఏరుకోవడానికి క్రిందకు దిగేసరికి బస్ కదిలింది. సుజాత కాలు జారి కింద పడింది. ఆమెకు కొంచెం దెబ్బ తగిలింది. సిగ్గుతో తల వంచుకుని క్రిందపడిన పుస్తకాల్ని ఏరుకుంది. అంతలో ఆమె చుట్టూ కొంత మంది గుమికూడారు. సానుభూతుల వర్షాలు కురిపించారు. కదిలిన బస్ కూడా ఆగింది. సుజాత 'కిం' అనకుండా బస్ ఎక్కి వెళ్ళిపోయింది.

మరునాడు మనోహర్‌కు ఈ విషయం తెలిసింది. వెంటనే విజృంభించిన సింహంలాగా సుజాతను కలిశాడు. "ఆ పోకిరి నన్ను గేలిచేశాడు. ఊరుకున్నాను. నా మీద అమ్ము వేసినప్పుడు కూడా నేను పట్టించుకోలేదు. నేను బస్ ఎక్కుతుంటే నన్ను చేతితో నెట్టాడు. నేను క్రింద పడ్డాను. అప్పుడు కూడా నేనేమీ అనలేదు. కాని నేను క్రిందపడి పుస్తకాల్ని ఏరుకుంటున్నప్పుడు ఎగతాళిగా నన్ను చూసి నవ్వుతున్నాడే. అప్పుడే నాకు కడుపు మండింది. ఇంతచేసి నా బాధను చూసి ఆనందించిన ఆ శాడిస్టు అసలు మనిషేనా? లేదా రాక్షసుడా?..." అని ఆమె కంట తడి పెట్టింది.

మనోహర్ తిరిగి వెళ్ళిపోయాడు. ఆ హీరోగాడి అడ్రస్ కనుక్కుని ఆ రాత్రే వాడింటికి వెళ్ళి తలుపు తట్టాడు. అతను బయటకు రాగానే విపరీతంగా కొట్టాడు. పాపం హీరోగాడి ముక్కు నుంచి, నోటి నుంచి రక్తం కారుతోంది. మనోహర్ నిరాటంకంగా తిరిగి వచ్చాడు. కాని ఆ హీరోగాడు ఒక సబ్ ఇన్‌స్పెక్టర్ కొడుకు కావడమే అతనికి సమస్యని తెచ్చి పెట్టింది.

ప్రిన్సిపాల్ గది నుంచి బయటకు రాగానే మనోహర్‌ను తోటి విద్యార్థులు విద్యార్థినులు చుట్టుముట్టారు. "ప్రిన్సిపాల్ ఏమన్నారు?" అని ఆతురతగా ఒకడు అడిగాడు.

"ఏమంటారు. అంతా మామూలే. ఈసారి నాలుగు రోజులు సస్పెన్షన్" అని చిరునవ్వుతో చెప్పాడు మనోహర్.

జరిగిన విషయాన్ని గురించి తర్వాత మనోహర్ నాతో చెప్పాడు.

ప్రిన్సిపాల్ గదిలో అడుగు పెట్టగానే అతను "మనోహర్-నీ రౌడీతనాన్ని ఎప్పుడు మానేస్తావు?" అని అడిగారట.

"ఏంటి సార్?"

"ఏమీ...అభం శుభం తెలియని అమాయకునిలాగా ... 'ఈ పిల్లిపాలుతుందా అన్నట్టు మాట్లాడుతున్నావు. చెప్పు. ఈ అమ్మాయితో ఏమన్నావు?"

"ఏమన్నాను" అని మనోహర్ అమృతాను అడిగాడట. ఆమె ఏం చెప్పకుండా తలవంచుకుందట.

"సార్! నేను ఏమన్నానని ఈమె చెప్పింది?"

"శైవ సిద్ధాంతం వద్దు... విజయవిలాసం చదువు అని కొంచెం అనకూడని మాటలు కూడా అన్నావట?"

"అయ్యో సార్! నేను అలా అనలేదు. శైవ సిద్ధాంతం చదువుతున్నారా అమృతా? తర్వాత పీరియడ్ విజయవిలాసం కదా అది చదవండి" అని అన్నాను.

"అట్లా అన్నావా? డార్లింగ్, గీర్లింగ్ అని ఏమీ అనలేదా?"

"అదా.. మనం చిన్నీ, బుజ్జి అని తెలుగులో ముద్దు చేస్తాం గదండీ... అదే ఇంగ్లీషులో ఏమని పిలుస్తారో తెలియజెప్పానండీ"

"అలాగా, చాలా సంతోషం. మరో నాలుగురోజులు ఇంటి దగ్గరుండి ఇంకా కొత్త కొత్త పదాలు నేర్చుకో..." అంటూ సస్పెన్షన్ ఆర్డర్ ఇష్యూ చేశారు ప్రిన్సిపాల్

గారు.

ఇది ప్రతి కాలేజీలో జరిగే సర్వసాధారణమైన సంఘటనే! అలా సస్పెండ్ అయిన అబ్బాయిలు ఆ అమ్మాయిఖిదారికావి యాగీ చెయ్యడ మన్నది సర్వ సాధారణమైన విషయం. కాని మనోహర్ ఈ కథని చక్కని మలుపు తిప్పాడు.

కెమిస్ట్రీ రికార్డు పూర్తి చేస్తున్న నా దగ్గరకొచ్చి "ఒరేయ్ చక్రీ! ఈ ఉత్తరం చదవరా" అంటూ నా ముందొక ఉత్తరం వుంచాడు.

అది- అమృతకి వాడు రాసిన ప్రేమ లేఖ.

నోట్సు పుస్తకంలోని ఓ కాగితం మీద రాసిన ఆ ఉత్తరం చూసిన నేను ఉండలా చుట్టివాడి మొహాన కొట్టాను.


వాడికి కించిత్తు కోపం వచ్చింది. 'ఏమిట్రా, నేను అంతగా కష్టపడి ప్రేమలేఖ రాస్తే దాన్ని అలా మొహాన కొట్టావా?" అనడిగాడు.

"నేను కాదు- అమృత కొడ్తుంది. అమృతే కాదు ఆమె స్థానంలో వున్న ఏ ఆడపిల్ల అయినా అంతే చేస్తుంది."

"ఏమిటంట... నేను చేసిన పొరపాటు"

"మామా! ఈ కెమిస్ట్రీ రికార్డు చూడు- నీట్‌నెస్‌కి కొన్ని మార్కులు వుంటాయి. ఎక్స్‌పెరిమెంట్సుకి, యాక్యురెసీకి మరికొన్ని మార్కులుంటాయి. ప్రేమ పరీక్ష కూడా అంతే..."

"...."



"ఆ దుకాణంలో వున్నది మీ అబ్బాయేనా?"

"కాదు మా అమ్మాయి"

"సారీ! మీ ఇద్దరూ ఒకేలా వుంటే అనుకున్నాను మీరు ఆవిడ నాన్న అని"

"నేను ఆవిడ నాన్నని కాదు, అమ్మని"

- గొల్లపూడి శైలజ

"ప్రేమలేఖ అనేది భావ జలధిలో పగడం లాంటిది. పది కాలాలపాటు దాచుకునేది- హృదయానికి దగ్గరగా వుండేది. అటువంటి ప్రేమలేఖని ఎప్పుడూ చిత్తు కాగితాలపైన రాయగూడదు. మల్లెపూవులా ఇస్త్రీ చేసిన గ్లాస్కో పంచెలా వున్న చక్కని కాగితం మీద రాయాలి. అక్షరాలు ఒక్క తప్పులేకుండా అందంగా వుండాలి. అంతకు మించి- ఆ అమ్మాయి అందమైన నవ్వు, అలంకరణని పొయిటిక్‌గా రాయాలి. ఎగ్జామ్స్‌లో బిట్ పేపర్ ఆన్సర్ చేసినట్లుంటే ఎలా?" అనడిగాను.

"అలాగా? "ఈ విషయంలో నాకు అనుభవం లేదురా" అని ఏం ఆలోచించాడో, దూకుడుగా బయటకు వెళ్ళిన వాడు ఇరవై నిమిషాలలో తిరిగి వచ్చాడు. ఇప్పుడు వాడి చేతుల్లో రకరకాల లెటరు పాడ్స్, ఎన్‌వెలప్స్, స్కెచ్ పెన్స్ వున్నాయి.

"ఒరేయ్ చక్రీ, కావలసిన స్టేషనరీ అంతా తీసుకొచ్చాను. నా హేండ్ రైటింగ్ అంతగా బాగుండదు. అమృతకి నా పేరున ఓ ప్రేమలేఖ రాసిపెట్టు"

తీర్థయాత్రలకి వెళ్లేవారి చేతుల్లో పదో పరకో పెట్టి 'మా పేరు మీద దేవునికి కానుక వేయి' అనే వార్ని చూశానుగాని ఇలా 'నా పేరున అమృతకి ప్రేమలేఖ రాసిపెట్టు' అన్న మనోహర్ గాణ్ణి మాత్రమే చూశాను."

నా చూపుర్ని అర్థం చేసుకున్న వాడిలా అన్నాడు-

"తప్పదురా! నా పని పూర్తి కానిదే నీ పని ముందుకు సాగదు" అంటూ నా చేతిలోని రికార్డు లాగేసుకున్నాడు.

వాడితత్వం నాకు బాగా తెలుసు. వాడు చెప్పేది మనం వినాలే గాని, మనం చెప్పేది వాడు వినిపించుకోడు.

తప్పనిసరయి అమృతకి వాడి పేరున ప్రేమలేఖ రాశాను.

ఇప్పటివరకు నాకే ఇబ్బంది లేదు. కాని వాడు నేను రాసింది రాసినట్టుగానే ఒక కవర్లో పెట్టి ఆమెకి ఇవ్వడానికి బయల్దేరాడు. వాడి చేతి రాత వాడికే అర్థం కాదు గనక అంతకంటే నాకు మరోమార్గం కనిపించలేదు. నా చేతి రాతతో వాడి పేరున ప్రేమలేఖ వెళ్తోంది. ఆ లేఖని ఆమె ప్రిన్సిపాల్‌కి ఇస్తే?

(ముగింపు వచ్చే సంచికలో)


## ఉబ్బసనివారిణి హైదరాబాద్ చేపమందు

సర్వ ఉబ్బస రోగులకు గత **22** సంవత్సరములనుండియూ అపారమైన సేవచేసి రోగుల మన్ననలందుకొనుచున్న ప్రసిద్ధ డాక్టరు ఎస్.కె.వలీగారు గతంలోవలెనే ఈ సంవత్సరము కూడా మృగశిరకార్తె ప్రవేశ దినములైన **8-6-89**వ తేదీ గురువారం మరియు **9-6-89**వ తేదీ శుక్రవారములలో ఉ.7 గంటల నుండి రా. తి.7 గంటల వరకు ఈ దిగువ కనబరచిన స్థలములలో మందు డాక్టరుగారి ద్వారాను, వారి అసిస్టెంట్ల ద్వారాను యివ్వబడును. గాన రోగులు ఈ సదవకాశమును వారివారి మంచి కొరకు వినియోగించుకొనవలసిందిగా మనవి చేయుచున్నాము.

చేప మందు చికిత్స రుసుము రు. **32-00** అదనపు నాలుగు వారముల చికిత్స రుసుము రు. **32-00**లు అదనము.



### మందు ఇవ్వబడు స్థలములు

| | | |
|---|---|---|
| 1. | శ్రీకాకుళం | రాజా లాడ్జింగ్, జి.టి.రోడ్, ఫోన్: 297 |
| 2. | విజయనగరం | హోటల్ శ్రీలక్ష్మి, ఎం.జి.రోడ్, ఫోన్: 3106 |
| 3. | విశాఖపట్నం | హోటల్ ఆనంద్, జగదాంబ బిల్డింగ్, ఫోన్: 63105 |
| 4. | అనంతపురం | హోటల్ భీమా లాడ్జి, రైల్వే ఫీడర్ రోడ్డు ఫోన్: 21531 |
| 5. | వరంగల్లు | విజయా లాడ్జి, రైల్వే స్టేషన్ రోడ్, ఫోన్: 4142 |
| 6. | ఖమ్మం | హోటల్ కిన్నెర, బస్‌స్టాండ్ వద్ద, ఫోన్: 8369 |
| 7. | కాకినాడ | ద్వారకా లంచ్‌హోమ్, మెయిన్‌రోడ్ ఫోన్: 309 |
| 8. | రాజమండ్రి | శాంతి నివాస్, మెయిన్‌రోడ్ ఫోన్: 5388 |
| 9. | ఏలూరు | వసంతమహల్, జి.ఎన్.టి.రోడ్, ఫోన్: 1080 |
| 10. | విజయవాడ | హోటల్ నవయుగ, ఆర్.టి.సి. బస్‌స్టాండు ఎదుట ఫోన్: 77677 |
| 11. | గుంటూరు | శ్రీ అజంతా లాడ్జి, సరస్వతి పిక్చర్ ప్యాలెస్ ఎదురుగా, ఫోన్: 21185 |
| 12. | నరసరావుపేట | రవిశంకర్ లాడ్జి, తాలూకా ఆఫీసు ఎదుట ఫోన్: 638 |
| 13. | మాచర్ల | ప్రశాంతి లాడ్జి, రైల్వే స్టేషన్ రోడ్, ఫోన్: 148 |
| 14. | ఒంగోలు | హోటల్ రాజధాని, ట్రంకు రోడ్డు, సంతపేట ఫోన్ : 2801 |
| 15. | గుంతకల్లు | సుదర్శన్ లాడ్జి, మెయిన్ రోడ్డు, ఫోన్: 528 |
| 16. | నెల్లూరు | రాఘవ విహార్, ఎ.సి.సుబ్బారెడ్డిగారి బిల్డింగ్ వద్ద |
| 17. | తిరుపతి | గోకుల లాడ్జి, టి.టి.డి.బస్‌స్టాండ్ ఎదుట, 33టి.పి.ఏరియా |
| 18. | చిత్తూరు | ఎం.ఎస్.ఆర్. లాడ్జి, హైరోడ్, ఫోన్: 2492 |
| 19. | కడప | ద్వారకా లాడ్జి, ఏడురోడ్లవద్ద |
| 20. | కర్నూలు | చంద్రా లాడ్జి, పార్కురోడ్ |

ARUNA

డాక్టర్ ఎస్.కె.వలీ (రిజిష్టర్డు నెం. 413) ఫోన్:41 పోరుమామిళ్ల (పోస్టు) కడప జిల్లా (ఆంధ్రప్రదేశ్) పిన్: 516193

గమనిక: డాక్టర్ గారిని సంప్రదించదలచినవారు గుంటూరు సెంటర్‌నందు కలువవచ్చు

డాక్టర్ వలీగారి కుమారుడు డాక్టర్ ఎస్.ఎం.డి. షఫీ ఎం.ఎ; బి.ఎ.ఎం.ఎస్ (ఎం.డి.) గారిని వరంగల్ సెంటర్‌నందు కలువవచ్చు.